క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధనలక్ష్మీ పూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా ఘనంగా ధనలక్ష్మీ పూజ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వర స్వామికి, స్వామివారి చెల్లెలు లలితా దేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ధనలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నూతన పట్టువస్త్రాలు, పుత్తడి ఆభరణాలతో రూ.20, 50, 100 కరెన్సీ నోట్లతో అలంకరించారు. అమ్మవారి పాదాలను చిత్రించి దీపాలతో అలంకరించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు

పోరుమామిళ్ల : రైల్వేకోడూరులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్ – 14 విభాగంలో పోరుమామిళ్లకు చెందిన గోవర్ధన్, అండర్ – 17 విభాగంలో చరణ్ బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. సోమవారం ఆయన విజేత విద్యార్థులను అభినందించారు. కాగా డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని నాయబ్ పేర్కొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం

మైదుకూరు : బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతున్న మైదుకూరుకు చెందిన బాలికకు సోమవారం ప్రొద్దుటూరుకు చెందిన ప్రాణదాత సేవా సమితి వారు ఆర్థిక సహాయాన్ని అందించారు. పట్టణంలోని సర్వాయిపల్లె రోడ్డుకు చెందిన షేక్ అహ్మద్ హుస్సేన్, షేక్ హసీనాల పదేళ్ల కుమార్తె షహనా బ్రెయిన్ క్యాన్సర్‌తో రెండేళ్లుగా బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రులు ప్రాణదాత సేవా సమితి వారిని సంప్రదించగా, సంస్థ సభ్యులు దాతల సహకారంతో రూ.30 వేలు బాలిక తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో దాతలు కె.దిలీప్ కుమార్‌రెడ్డి, డి.రాంబాబు, ఎస్.మనోహర్, కొర్రపాడు వేణు, ఆకేపాటి శంకర్‌రెడ్డి, అంపయ్య, సంస్థ చైర్మన్ సునీల్, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

కలసపాడు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన 6 మందిని ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2450లు నగదుతోపాటు రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగమురళి తెలిపారు. కొండపేట వద్ద కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించి 6 మంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు ఓబులేసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చర్చి ప్రారంభోత్సవం

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని కోనసముద్రం పంచాయతీ ఎల్లుగారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్యమాత చర్చి ప్రారంభోత్సవం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వీరప్పల్లి విచారణ గురువులు ఫాదర్ టి.రమేష్, ఫాదర్ సల్లా మనోహర్‌లు తెలిపారు. సోమవారం చర్చి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చర్చి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా కడప మేత్రాసన పీఠాధిపతి గాలి బాలి, కర్నూలు జిల్లా నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధతో పాటు వివిధ విచారణల గురువులు హాజరవుతారని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం దివ్య బలిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీడ్రస్ కాంపిటీషన్



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని గౌతమ్ హైస్కూల్‌లో విద్యార్థులకు బాలల దినోత్సవంలో భాగంగా ఫ్యాన్సీడ్రస్ కాంపిటీషన్ అందరిని ఆకట్టుకుంది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, 1వ తరగతి విద్యార్థులకు ఫ్యాన్సీడ్రస్ కాంపిటీషన్, 2, 3 తరగతుల విద్యార్థులకు ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బాలల దినోత్సవం నాడు బహుమతులు అందించనున్నట్లు కరస్పాండెంట్ సుధీర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్షం కోసం స్వాములకు జలాభిషేకం

రాజుపాళెం : వర్షం కురవాలని మండలంలోని గాదెగూడూరు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్తులు గ్రామంలోని అన్ని ఆలయాల్లోని స్వాములకు జలాభిషేకం చేశారు. గంగమ్మకు, పెద్దమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. సర్పంచ్ పోలా వరలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న టపాసులు స్వాధీనం

అట్లూరు : అక్రమంగా టపాసులు విక్రయిస్తున్న నేలపాటి వెంకటసుబ్బయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి టపాసులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య తెలిపారు. కాగా పట్టుబడిన టపాసుల విలువ రూ.45 వేలు ఉంటుందని ఆయన తెలిపారు.

దుష్టులకు భయంకరి.. శిష్టులకు అభయంకరి

'దుష్టులకు భయంకరిగా.. శిష్టులకు అభయంకరి'గా పోలేరమ్మవారు విరాజిల్లుతున్నారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందారు. గ్రామస్తులను చల్లగా చూస్తూ, అంటువ్యాధుల నుంచి రక్షిస్తున్నారు. పొలిమేరలో సదా కాపు కాస్తూ.. గ్రామాలను భూత ప్రేతాల నుంచి కాపాడుతున్నారు.

- భక్తులకు కొంగు బంగారం శ్రీపోలేరమ్మ
- బ్రహ్మంగారి కుటుంబంతో ఎనలేని అనుబంధం
- ఆలయ జీర్ణోద్ధరణకు ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో శ్రీపోలేరమ్మవారు



గ్రామపెద్దకు పోలేరమ్మ నిప్పు తెచ్చిన రచ్చబండ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని కందిమల్లాయపల్లె, సోమిరెడ్డిపల్లె గ్రామస్తులు శ్రీ పోలేరమ్మను గ్రామదేవతగా కొలుస్తున్నారు. ఆమెకు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కుటుంబంతో ఆత్మీయ అనుబంధం ఉంది. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని భక్తులు తరలివస్తారు. ఈ క్రమంలో ఆలయాన్ని పునర్నిర్మించారు. జీర్ణోద్ధరణ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి చరిత్రపై భక్తుల తెలిపిన సమాచారం మేరకు 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. గతంలో కందిమల్లాయపల్లెలో పోలేరమ్మ జాతర నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఊరి రచ్చబండపై వారు కూర్చొని.. ఎవరెవరు చందాలు ఇవ్వలేదు అనే విషయంపై ఆరా తీశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఇవ్వకపోవడంతో అక్కడికి పిలిపించారు. చందా ఇవ్వాలని గ్రామపెద్దలు అన్నారు. 'నేను చాలా బీదవాడిని కదా.. నన్ను వదిలేయకూడదా అనగా.. వారు హేళన చేసి మాట్లాడారు. ఆ సమయంలో గ్రామపెద్ద చుట్ట అంటించుకునేందుకు అగ్గి కోసం వెతికాడు. అప్పుడు స్వామి వారు.. 'పోలేరీ.. గ్రామ పెద్దకాపునకు చుట్ట అంటించుకునేందుకు నిప్పు తీసుకురామ్మా' అన్నారు. (అప్పటికే జాతర కోసం.. పోలేరమ్మ మట్టి విగ్రహాన్ని తయారు చేయించి, రచ్చబండ ఎదురుగా ఉంచారు.) అమ్మవారు బాలిక రూపంలో నిప్పు తీసుకుని వచ్చి ఇచ్చారు. అప్పుడు గ్రామస్తులు 'స్వామీ మమ్మల్ని మన్నించు' అని.. పాదాభివందనం చేశారు. తర్వాత కాలంలో స్వామివారు లోక సంచారం చేసి.. జ్ఞాన జ్యోతులు వెలిగించారు. ఆయన 1693లో వైశాఖ శుద్ధ దశమినాడు సజీవంగా సమాధిలోకి ప్రవేశించారు. లోకకల్యాణార్థం తపోనిష్ట గరిష్టులయ్యారు. ఆ ప్రాంతంలో స్వామి పేరిట మఠం వెలిసింది.

గోవిందమాంబకు ప్రత్యక్షం..

సజీవ సమాధి నిష్ట వహించిన ఏడాది సందర్భంగా స్వామివారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహించాలని మఠం వారు సంకల్పించారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలిపేందుకు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మూడవ పుత్రుడు శ్రీపోతులూరయ్య స్వామి బయలుదేరాడు. వనిపెంట, మునిమడుగు గ్రామాలకు వెళ్లారు. అక్కడి విశ్వబ్రాహ్మణులు ధన మదంతో విర్ర వీగుచూ.. 'వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని గోవిందమాంబ ప్రపంచ ధర్మం వీడి నేటికీ గాజు, పూస, మెట్టియలు, పసుపు కుంకుమలు నిషేధించక ముత్తైదువుగా వుండి అపచారం చేస్తున్నారు. కావున మేము మీ తీర్థప్రసాదాలు స్వీకరించబోము' అన్నారు. అక్కడి నుంచి వెంటనే పోతులూరయ్య మిట్ట మధ్యాహ్నం బయలుదేరి మఠంలోకి ప్రవేశించారు. గోవిందమాంబ వద్దకు వచ్చి జరిగిన విషయాన్ని తెలిపారు. 'నాయనగారు జీవించి ఉన్నాడని, నేను నమ్మినా.. లోకాన్ని ఎలా నమ్మించగలను' అన్నాడు. సమాధిని పగులగొట్టి చూచెదనని చెప్పాడు. అంతట గోవిందమాంబ కన్నీరు కారుస్తూ .. వనిపెంట వాళ్లు వల్లకాడు గానూ, మునిమడుగు వారు ముదనష్టం' గాను అని శపించారు. అందరూ నిద్రపోయిన తర్వాత పోతులూరయ్య అర్ధరాత్రి సమయంలో సమాధి వద్దకు వెళ్లి పైన గల బండను తీశాడు. అంతట స్వామివారు.. 'ఎంత పని చేసితివి, నీకు ప్రాయశ్చిత్తం తప్పదు' అన్నారు. అరణ్యం వెళ్లి 12 ఏళ్లు తపస్సు చేయాలని ఆజ్ఞాపించారు. పోతులూరయ్య జరిగిన విషయాన్ని ఇంట్లో చెప్పారు. గోవిందమాంబ ఏకాంతంగా కూర్చొని శ్రీ పోలేరమ్మను తలచారు. అమ్మవారు బాలిక రూపంలో ప్రత్యక్షమై.. ఎందుకు చింతిస్తున్నారమ్మా అని అడిగారు. పోతులూరయ్య అరణ్యం వెళ్లి తపస్సు చేయబోతున్నాడు. నీవు కాపాడు తల్లీ అన్నారు. పోలేరమ్మ అలాగే తల్లీ అని చెప్పి అంతర్ధానమయ్యేను.

శ్రీ పోతులూరయ్యస్వామి ఆజ్ఞ మేరకు..

పోతులూరయ్య సమీపంలోని పోరుమామిళ్ల మండలం మలమీదపల్లె వద్ద గల పర్వతం పైనున్న చింత చెట్టు కింద కూర్చొని తపస్సు ప్రారంభించారు. శ్రీ పోలేరమ్మ గొల్ల యువతీ వలే.. రోజూ వచ్చి పాలు పోస్తుండెను. ఆయన తపస్సు పూర్తి అయిన తర్వాత.. అమ్మా నీవెవరు, ఇంత అడవిలో సాయం చేశావు, మరువలేనన్నారు. నీవు పోసిన పాలకు.. పైకం ఎంత ఇవ్వాలో చెప్పు అన్నారు. స్వామీ.. నేను పోలేరమ్మను, నన్ను మీ నాయనగారి మఠంలో ఉండునట్లు చేయాలని కోరారు. అంత పోతులూరయ్య.. తల్లీ అది కుదరదు, ఎందుకంటే అక్కడ సాత్వికాహారులకు తప్ప ఇతరులకు అవకాశం ఉండదు. మీకు జాతరలు, బోణాలు తదితరాలు జరుగుతాయి. నిన్ను వేరొక చోట ప్రత్యేకంగా వుండునట్లు చేసేదనన్నారు. అక్కడి నుంచి బయలుదేరి రెండు కనుమల మధ్య నుంచి కింది భాగానికి దిగివచ్చే సమయంలో ఒక వేప చెట్టును చూపి.. తల్లీ నీవు ఇందులో ఐక్యం అవ్వాలని చెప్పారు. ఇక నుంచి నిన్ను 'కనుమ పోలేరమ్మ, మలమీదపోలేరమ్మ' అని సర్వ జనులు భక్తితో కొలుస్తారన్నారు. అమ్మవారు.. స్వామి ఆజ్ఞను పాటించారు.

నేడు రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు

చాపాడు : మండలంలోని సోమాపురం, వెదురూరు గ్రామాలలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. రెండు గ్రామాలలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, గ్రామ ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆర్టీపీపీకి ఎంవీఆర్ పేరు పెట్టడం హర్షణీయం



మల్లేల రాజారాంరెడ్డి, మల్లేల ఝాన్సీరాణిలను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

ప్రొద్దుటూరు : రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌కు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి పేరు పెట్టడం హర్షణీయమని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తెలిపారు. మండలంలోని లింగాపురంలో ఉన్న ఎంవీఆర్ కుమారుడు మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణిని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆదివారం కలసి దీపావళి శుభాకాంక్షలు తెలిపి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఎంవీ రమణారెడ్డి డాక్టర్‌గా, రచయితగా, రాయలసీమ ఉద్యమ నేతగా, కార్మిక నేతగా ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆయన ఈ ప్రాంత ప్రజలకు విశేష సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాణదాత సేవా సమితి, మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్, స్నేహ సేవా సమితి, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి బూమి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

మైదుకూరు : పట్టణంలోని 11వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర భూమి పూజ నిర్వహించారు. వార్డులో ఎస్టీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.3.30 లక్షలతో వార్డు కౌన్సిలర్ పిల్లి ఇందిరారాణి, ఇన్‌చార్జి పిల్లి నాగయ్య సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ కొబ్బరికాయ కొట్టి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ఎస్టీ కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కౌన్సిలర్ ఇందిరారాణికి సూచించారు.

తాగునీటి సమస్యపై స్పందన

పట్టణంలోని 8వ వార్డులో తాగునీటి సమస్యపై మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర స్పందించారు. వార్డులోని బాలాజీ నగర్‌లో తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తడంతో ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ చైర్మన్ చంద్ర, కోఆప్షన్ సభ్యుడు దండు సుబ్బయ్యతో కలిసి బాలాజీనగర్‌లోని తాగునీటి పైపులైన్‌ను పరిశీలించారు. స్థానిక కడప రోడ్డులోని రెడు బోర్ల నుంచి సరఫరా అయ్యే తాగునీరు తమ ప్రాంతానికి అందడం లేదని బాలాజీనగర్ కాలనీ వాసులు చైర్మన్‌కు వివరించారు. ఆయన సమస్యను పరిష్కరించేందుకు స్థానిక శ్రీహరి నగర్ వద్ద ప్రధాన పైపులకు వాల్వ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

10 గ్రామాల ఆయకట్టు రైతులకు నీరు అందిస్తున్నాం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల పరిధిలోని 10 గ్రామాల ఆయకట్టు రైతులకు సాగు నీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కాకిరేణిపల్లె గ్రామ సమీపంలో గోపవరం బ్రాంచి కెనాల్ వద్ద పూడికతీత పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో కనీసం మైలవరం కాలువలోని పూడికను తీయలేకపోయారన్నారు. వారు కూడా రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం సబబేనా అన్నారు. ఎరువులు, విత్తనాల కోసం క్యూలో నిలబడి లాఠీ దెబ్బలు తిన్న రోజులు ఎవరూ మరిచిపోలేదన్నారు. నేడు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామని, ప్రతి ఏటా రైతు భరోసా ద్వారా రూ.13,500 రైతులకు చెల్లిస్తున్నామన్నారు. పేదలు మూడు పూటలా అన్నం తినేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత నెలలోనే తాను కలెక్టర్‌తో చర్చించి కేసీ కెనాల్, మైలవరం డ్యాంల నుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకున్నానన్నారు. ప్రస్తుతం గోపవరం బ్రాంచి కెనాల్‌లో పూడిక పేరుకుపోవడంతో నీరు ముందుకు వెళ్లడం లేదని అందుకోసమే పూడిక తీయిస్తున్నామన్నారు. ఈ కాలువ పరిధిలో టంగుటూరు, గోపవరం, గాదెగూడూరు, దద్దనాల, కూలూరు, పర్లపాడు, అర్కటవేముల, కాకిరేణిపల్లె, వెంగళాయపల్లె, వెలవలి, టంగుటూరు తదితర గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, రాజుపాళెం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, రాజుపాళెం మండలం గ్రామ సచివాలయ మండల కన్వీనర్ వెలవలి రాజశేఖర్‌రెడ్డి, కాకిరేణిపల్లె సర్పంచ్ ఉండేల గురులక్ష్మీదేవి, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, గాదెగూడూరు వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మైలవరం జలాశయం డీఈ అశ్వర్థనారాయణ, ఏఈలు లలిత, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను సోమవారం తన స్వగృహంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయం అధికారి టి.తిరుపతమ్మ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీల కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. 20న ఉదయం 9.30 గంటలకు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, హౌసింగ్ బోర్డు గ్రంథాలయం అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్ నుంచి నీటి విడుదల



రామసముద్రం చెరువు నుంచి నీటిని విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బి.కోడూరు : ఈ ఏడాది మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వర్షాలు లేక చెరువులన్నీ వట్టిపోయి ఆయకట్టు భూములు బీడు భూములుగా మారాయి. అలాగే భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరుబావుల కింద సాగు చేసిన మొక్కజొన్న, వరి, ఉల్లి, పత్తి తదితర పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఇంజనీర్లతో మాట్లాడి బ్రహ్మంసాగర్ నుంచి బొక్కినేరు ద్వారా ఎల్ఎస్‌పీ ఎడమ కాలువ ద్వారా మండలంలోని మున్నెల్లి, రాజుపాలెం, అమ్మవారిపేట, గుంతపల్లె, బి.కోడూరు, అనుమోరుపల్లె, రామసముద్రం, నల్లవాగుపల్లె, మాధవరాయునిపల్లె చెరువులకు గత వారం రోజులుగా బ్రహ్మంసాగర్ నీటిని నింపారు. ఆదివారం రామసముద్రం చెరువు నుంచి దిగువ ఆయకట్టు చెరువులైన బొడ్డోనికుంట, ఆంకనగొడు గునూరు, మేకవారిపల్లె పెద్దచెరువు, నరసింహాపురం, పెద్దుళ్లపల్లె, కొండంపల్లె చెరువులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు.

అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి సన్నిధిలో 18న వేలం పాట

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో ఈ నెల 18న తలనీలాలు ప్రొగు చేసుకొనుటకు, టెంకాయల విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. దేవస్థానం వద్ద 2024 జనవరి 1 నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకూ తలనీలాల ప్రొగుకు, ఇదే క్రమంలో ఈ ఏడాది డిశంబర్ 7 నుంచి 2024 డిశంబర్ 6 వరకు టెంకాయలు అమ్ముకునే హక్కు కోసం వేలం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆలయ నిబంధనల మేరకూ హెచ్చు వేలం పాటాదారుడికి హక్కులను అప్పగించనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

నేటి నుంచి చాపాడులో గ్రంథాలయ వారోత్సవాలు

చాపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి తెలిపారు. 14న బాలల దినోత్సవం,బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ఉద్యమకారులకు నివాళులర్పించడం, 17న విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖన వివిధ రకాలైన పోటీలు నిర్వహించన్నున్నట్లు తెలిపారు .20న ముగింపు వేడుకల సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

పిల్లలను బడికి పంపండి

కలసపాడు : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఖాశీం వలి తెలిపారు. సోమవారం కలసపాడులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నాడు – నేడుతో పాఠశాలల సుందరీకరణ, ఆంగ్ల విద్యపై పట్టు సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అమ్మఒడి, డిజిటల్ బోధన వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు.

సీమను ఎడారి చేసే చీకటి చట్టం

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ లబ్ధి కోసం రాయలసీమను ఎడారి చేసే చీకటి చట్టాన్ని తీసుకువచ్చాయని విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి తెలిపారు. స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో సోమవారం సీమను ఎడారి చేసే చీకటి చట్టం కరపత్రాలను ఆవిష్కరించారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ ఎస్పీ మహమూద్, సృజన సామాజిక వేదిక నాయకుడు శ్రీనివాసులరెడ్డి, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా సురేష్‌రెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌వీఎస్ కన్వీనర్ హరిత, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ కల్యాణ మండప కమిటీ ప్రమాణ స్వీకారం



దేవాంగ కల్యాణ మండపం నూతన కమిటీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయకనగర్‌లోని దేవాంగకల్యాణ మండపంలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. కమిటీ శాశ్వత గౌరవాధ్యక్షులుగా వుట్టి నాగశయనం, వుట్టి వీరయ్య, సందు శివనారాయణ, పుచ్చగింజల రంగారావు, జొన్నా కుళ్ళాయిస్వామి, వుట్టి తిరుపతయ్య, అధ్యక్షునిగా రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా మచ్చా వెంకట సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా దేవరశెట్టి ఆదినారాయణ, జొన్నా మునిస్వామి, కోశాధికారిగా కొంపల వెంకటాచలపతి, ఉపకోశాధికారిగా గిద్దలూరు మల్లికార్జున, సహాయ కార్యదర్శులుగా వేమిశెట్టి నాగరాజు, గోదెన కృష్ణ కుమార్, డైరెక్టర్లుగా బత్తల వెంకట సుబ్బయ్య, నున్న రామకృష్ణ, మచ్చా రామాంజనేయులు, మచ్చా బాబు, వెంకటశశిధర్, పద్మనాభం, వెంకట్రామయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరు మూడేళ్ల పదవుల్లో కొనసాగనున్నారు. కల్యాణ మండపం గౌరవాధ్యక్షుడు వుట్టి నాగశయనం మాట్లాడుతూ కల్యాణ వేదిక ఆధునీకరణ, పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తె గది నూతన నిర్మాణం చేయడంతో పాటు లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నూతన కమిటీని ఈ సందర్భంగా పలువురు సత్కరించారు. దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు దాశెట్టి నారాయణస్వామి, కల్యాణ మండప గౌరవ సలహాదారులు పోసా కృష్ణయ్య, బత్తల వెంకటసుబ్బయ్య, కుల పెద్దలు పాల్గొన్నారు.

శతావధాని సీవీ సుబ్బన్నకు ఘన నివాళి



సీవీ సుబ్బన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఒంటేరు శ్రీనిసులరెడ్డి, జింకా సుబ్రమణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సోమవారం ప్రముఖ శతావధాని సీవీ సుబ్బన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, రచయిత జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ అవధాన విద్యపై ఆయన చేసిన పరిశోధనకు మైసూరు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. రాయలసీమ వ్యాయామ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కోటా ఓబుళరెడ్డి, ఎస్ఎల్‌టీఏ కోశాధికారి బోగా గంగాధర్, హరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లారీని వెనుక నుండి ఢీ కొట్టిన మరో లారీ

పోరుమామిళ్ల : మండలంలోని అక్కలరెడ్డిపల్లె దగ్గర ఆగివున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొట్టిన ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం విజయవాడ నుంచి పోరుమామిళ్ల వైపు దారిలో ఆగివున్న లారీని వెనుక వస్తున్న మరో లారీ ఢీ కొట్టింది. దీంతో ఢీ కొట్టిన లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, క్లీనర్‌కు కాలి నరాలు తెగినట్టు తెలిసిందని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గాయపడిన వారు చికిత్స నిమిత్తం నరసరావుపేటకు వెళ్లినట్లు తెలిసిందన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్సీకి వినతిపత్రం



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న ఆపస్ నాయకులు

పోరుమామిళ్ల : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలపై సోమవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి ఆపస్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెన్నయ్య, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేసి పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల పీఎఫ్ లోన్, సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐసీ, డీఏ బకాయిల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆపస్ పోరుమామిళ్ల, కాశినాయన మండలాల అధ్యక్ష, కార్యదర్శులు శీలారెడ్డి, సుబ్బారెడ్డి, గురుమూర్తి, రమణయ్యలు పాల్గొన్నారు.

నాలుగు మండలాలకు ఆపస్ నూతన కార్యవర్గం

మండల కేంద్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రాంతీయ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో నాలుగు మండలాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పోరుమామిళ్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీధర్‌గౌడ్, గురుమూర్తి, గౌరవ అధ్యక్షులుగా తుపాకుల శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా రామగాంధీ, మహిళా కన్వీనర్‌గా ఉమాదేవి ఎన్నికయ్యారు. అలానే కాశినాయన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సుబ్బారెడ్డి, రమణయ్య, గౌరవ అధ్యక్షుడిగా పోకల సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రమణ, మహిళా కన్వీనర్‌గా గురులక్ష్మి ఎన్నికయ్యారు. కలసపాడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శీలారెడ్డి, సుబ్రమణ్యం, ఆర్థిక కార్యదర్శిగా రమణ, మహిళా కన్వీనర్‌గా రమణకుమారి ఎంపికయ్యారు. బి. కోడూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తిరుమలరెడ్డి, రమణ, ఉపాధ్యక్షుడిగా నందకిశోర్, ఆర్థిక కార్యదర్శిగా బాబురావు, సభ్యులుగా నాగసుబ్బారెడ్డి, శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు



ఎరుకలయ్య విగ్రహానికి పూజలు చేస్తున్న పండితులు, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకలయ్య (ఏకరసానంద గిరి స్వామి), నామా కమలాక్షమ్మ ఆరాధనా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఎరుకలయ్య, కమలాక్షమ్మ విగ్రహాలకు, శ్రీ కృష్ణుని మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సామూహికంగా గీతాపారాయణం చేశారు. దేవదాయశాఖ ఏసీ శంకర బాలాజీ మాట్లాడుతూ నామా ఎరుకలయ్య సేవలను కొనియాడారు అవధాని నరాల రామారెడ్డి ఆరాధనా మహోత్సవాలలో పాల్గొని వారికి నివాళి అర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. విజయేశ్వరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. సాయంత్రం యడవల్లి రమణయ్య భాగవతార్‌తో నిర్వహించిన కృష్ణ తరంగం ఆలాపన, వీరబ్రహ్మేంద్రస్వామి ఉపాసకులు కృష్ణమాచార్యులతో నిర్వహించిన కాలజ్ఞాన ప్రవచనాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శైవాగమ వేదపాఠశాల విద్యార్థులు, ఆశ్రమంలోని విద్యాసంస్థల అధ్యాపకులు, యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని భక్తులు పాల్గొనాలని ఏసీ శంకర బాలాజీ కోరారు.